ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
శనివారం 5 అక్టోబరు 2024



ఖజానాను ఖాళీ చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వం
- ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

కార్మికుల జీవితాల్లో చీకటి నింపిన కాంగ్రెస్ ప్రభుత్వం
- మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్

8లో..



బస్ డిపో ఏర్పాటు చేయనున్న స్థలం

పెద్దపల్లి బస్టాండ్

పెద్దపల్లి బస్ డిపో ఏర్పాటుకు అడుగులు

- బస్టాండ్ సమీపంలో 4.31 ఎకరాల స్థలం కేటాయింపు
- రూ.14.15 కోట్లు చెల్లిస్తే స్థలం ఆర్టీసీ వశం
- ఇక డిపో మంజూరు కావడమే ఆలస్యం

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

పెద్దపల్లిలో ఆర్టీసీ బస్ డిపో ఏర్పాటుకు అడుగులు పడుతున్నాయి.. నెల రోజులుగా స్థల సేకరణకు వివిధ ప్రాంతాలను పరిశీలించిన అధికారులు బస్టాండ్ సమీపంలో పలు ప్రభుత్వ కార్యాలయాలు, పౌరసరఫరాల శాఖ గోదాములు ఉన్న స్థలమే అనుకూలమని నిర్ణయించారు. ఈమేరకు 4 ఎకరాల 31 ఎకరాల భూమిని టీఎస్ఆర్టీసీకి కేటాయిస్తూ కలెక్టర్ కోయ శ్రీహర్ష గతనెల 26న, ప్రొసీడింగ్స్ నంబర్. ఈ1/1629/2024 ఉత్తర్వులు జారీ చేశారు. గత నెల 10వ తేదీన 'ఆర్టీసీ బస్ డిపోకు స్థల సేకరణ.. బస్టాండ్ సమీపంలోని స్థలమే అనుకూలం' అనే శీర్షికన ఆంధ్రజ్యోతి జిల్లా ఎడిషన్‌లో కథనం కథనం ప్రచురితం అయ్యింది. బస్టాండ్ సమీపంలో ఉన్న స్థలమే బస్ డిపోకు అనుకూలమని అధికార యంత్రాంగం భావిస్తున్నారని, ఆ స్థలాన్నే కేటాయించే అవకాశాలున్నాయని కథనంలో పేర్కొన్న విషయం తెలిసిందే. అదే స్థలాన్ని అధికారులు ఖరారు చేశారు. నవంబర్ నెలాఖరులో జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా పెద్దపల్లిలో బస్ డిపో ఏర్పాటు చేస్తామని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు హామీ ఇచ్చారు. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం, ఎమ్మెల్యేగా విజయరమణారావు గెలుపొందారు. ఎన్నికల సందర్భంగా విజయ రమణారావు ఇచ్చిన ప్రధాన హామీల్లో పత్తిపాక రిజర్వాయర్, పెద్దపల్లి బస్ డిపో, పెద్దపల్లి బైపాస్ రోడ్డు నిర్మాణాల కోసం తీవ్రంగా కృషి చేస్తున్నారు. వాటి మంజూ రు కోసం విజయరమణారావు పలుసార్లు సీఎం రేవంత్‌రెడ్డి, సంబంధిత మంత్రులను కలిసి విన్నవించారు. జూలై 19వ తేదీన కాల్వశ్రీరాంపూర్ మండల కేంద్రంలో నిర్వహించిన ఆయిల్‌పామ్ రైతులకు అవగాహన సదస్సుకు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా పెద్దపల్లిలో ఆర్టీసీ బస్ డిపో ఏర్పాటుకు హామీ ఇవ్వాలని విజయ రమణారావు మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కోరారు. దీంతో ఏడాది తర్వాతనైనా పెద్దపల్లిలో ఆర్టీసీ బస్ డిపోను ఏర్పాటు చేస్తామని పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చారు. అందుకు కావాల్సిన స్థల సేకరణ చేయాలని విజయరమణారావుకు మంత్రి సూచించారు. దీంతో ఆయన కలెక్టర్‌ను డిపోకు కావాల్సిన స్థల సేకరణ చేయాలని కోరారు.

● కార్యాలయాల తరలింపు తర్వాతే..

ఆగస్టు చివరి వారం, గత నెల మొదటి వారంలో రెవెన్యూ అధికారులు స్థలాలను పరిశీలించారు. మొదట రాఘవాపూర్‌లో గల స్థలం డిపో ఏర్పాటుకు అనుకూలంగా ఉంటుందని ఆలోచన చేశారు. అయితే ఆర్టీసీ అధికారులు బస్టాండ్‌కు డిపోకు మధ్య 3 కిలోమీటర్లకు మించవద్దని, రాఘవాపూర్ స్థలం 5 కిలోమీటర్ల దూరంలో ఉండడంతో ఆ స్థలం డిపో ఏర్పాటుకు అనువుగా ఉండదని భావించారు. బస్టాండ్ సమీపంలోగల ఎంపీడీవో, ఎంఈవో, పంచాయతీరాజ్, పాడి రైతు శిక్షణ కేంద్రం, మిల్క్ కూలింగ్ యూనిట్ కార్యాలయం, సివిల్ సప్లయ్ గోదాములను మరో చోటికి తరలించి అక్కడ డిపో ఏర్పాటు చేసేందుకు అనుకూలంగా ఉంటుందని భావించారు. ఆ మేరకు సర్వే నంబర్ 592లో 36 గుంటల స్థలంలోగల సివిల్ సప్లయ్ గోదాం, సర్వే నంబర్ 589లో 6 గుంటల స్థలంలోగల ఎంపీడీవో, 7 గుంటల్లో గల ఎంఈవో, 7 గుంటల్లో గల డీఆర్‌డీఏ ఆఫీసులు, 3 గుంటల్లో గల సివిల్ సప్లయ్ కార్యాలయం, 4 గుంటల్లో గల పాడి రైతు శిక్షణ కేంద్రం, 12 గుంటల్లో గల జిల్లా లీగల్ మెట్రాలజీ కార్యాలయం, 14 గుంటల్లో గల మిల్క్ యూనిట్ కార్యాలయం, 5 గుంటల్లో గల ఎక్సైజ్ కార్యాలయం, 18 గుంటల్లో గల పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ కార్యాలయం, 3 గుంటల్లో గల డీఎల్‌పీవో కార్యాలయం, ఎకరం 36 గుంటల ఖాళీ స్థలాన్ని బస్ డిపో కోసం కేటాయించారు. ఈ స్థలానికి ధరణి పోర్టల్ ప్రకారం ఎకరానికి 2 కోట్ల 83 లక్షల 14 వేల రూపాయలు ఉండగా, మొత్తం 14 కోట్ల 15 లక్షల 70 వేల రూపా యలు ఆర్టీసీ సంస్థ యాజ మాన్యం చెల్లిస్తే ఆ స్థలాన్ని ఆర్టీసీకి అప్పగించనున్నారు. ఎంపీడీవో, ఎంఈవో, డీఆర్‌డీఏ, సివిల్ సప్లయ్ కార్యాలయాలు, పాడి రైతు శిక్షణ కేంద్రాన్ని మండల తహసీల్దార్ క్యాంపస్‌కు తరలించనున్నారు. అక్కడ జిల్లా పరిషత్‌కు, వీటికి కలిపి ఒకే భవనాన్ని నిర్మించనున్నారు. మిగ తా కార్యాలయాలను కలెక్టరేట్ భవన సముదాయంలోనికి మార్చను న్నారు. ఈప్రక్రియఅంతా పూర్తికావ డానికి ఏడాదైనా పడుతుంది. ఆర్టీసీ అధికారులు ఇంకా స్థలాన్ని పరిశీలించలేదు. వాళ్ల స్థలాన్ని పరి శీలించిన తర్వాత డిపోకు కావాల్సిన స్థలానికి డబ్బులు చెల్లించి డిపో ఏర్పాటుకు నిధులు మంజూరుచేయనున్నది. ఈ విషయమై ఎమ్మెల్యే విజయరమణారావు 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ ఆర్టీసీ బస్ డిపో ఏర్పాటుకు స్థల సేకరణ పూర్తయ్యిందన్నారు. ప్రభుత్వకార్యాలయాల భవనాల నిర్మాణాల కోసం నిధులను మంజూరు చేయా లని ప్రభుత్వాన్ని కోరినట్లు చెప్పారు. ఆర్టీసీ అధికా రులు డిపో ఏర్పా టుకు కావాల్సిన నిధుల మంజూరు కోసం ఒత్తిడి పెంచుతున్నామన్నారు. పెద్దపల్లిలో ఆర్టీసీ డిపో ఏర్పాటు చేసి ప్రజల కల నెరవేరుస్తానన్నారు.

కోర్టు ఏర్పాటుకు భవనాన్ని పరిశీలించిన ఆర్డీవో



ఓదెలలో కోర్టు ఏర్పాటుకు భవనాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో గంగయ్య

ఓదెల, అక్టోబరు 4 : ఓదెలలో కోర్టు ఏర్పాటు చేసేందుకు శుక్రవారం ఆర్డీవో గంగయ్య భవనాన్ని పరిశీలించారు. ఓదెల, కాల్వశ్రీరాంపూర్ మండలాలకు చెందిన కక్షిదారులకు, అలాగే జడ్జికి, న్యాయవాదులకు అనుకూలమైన స్థలం ఉందా, లేదా అనే విషయమై భవన పరిసరాలను పరిశీలించారు. ప్రభుత్వ కార్యాలయాల సమీ పంలో ప్రధాన రహదారిని ఆనుకొని ఉన్న ఓ ప్రైవేటు భవనం కోర్టు ఏర్పాటుకు అనుకూలంగా ఉందా, లేదా అని ఫొటోలను సేకరించారు. నివేదికలను ఉన్నత స్థా యి అధికారులకు పంపించడం జరుగుతుందని తెలిపారు. కోర్టు ఏర్పాటు అయితే రెండు మండలాల ప్రజలకు కోర్టు సేవలు అందుబాటులోకి రావడమే కాకుండా, ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న కేసులు త్వరగా పరిష్కారమవుతాయని తెలిపారు. వెంట తహసీల్దార్ యాకయ్య, ఆర్ఐ రమేష్ తదితరులు ఉన్నారు.

కార్పొరేటర్ వేధిస్తున్నాడని ఎలక్ట్రీషియన్ ఆందోళన

కోల్‌సిటీ, అక్టోబరు 4: కార్పొరేటర్ ఐత శివకుమార్ తనను వేధిస్తున్నాడని, సోషల్ మీడియాలో కించపరుస్తూ పోస్టులు పెట్టి అవమానిస్తున్నాడంటూ అవుట్‌సోర్సింగ్ ఎలక్ట్రీషియన్ కనకయ్య శుక్రవారం నగరపాలక సంస్థ కార్యాలయం ఎక్కాడు. తన పరువుపోతోందని, తాను చనిపోతానంటూ పేర్కొన్నాడు. దీంతో తోటి సిబ్బంది అతనికి నచ్చజెప్పారు. ఏమైనా సమస్య ఉంటే మేయర్, ఎమ్మెల్యేల దృష్టికి తీసుకెళదామని, కుటుంబాన్ని దృష్టిలో ఉంచుకుని కిందకు దిగి రావాలని సూచించారు. దీంతో అతడు కిందకు దిగాడు. తనను కార్పొరేటర్, మరికొందరు ఫోన్లు చేసి వేధిస్తున్నారని, తనపై సోషల్ మీడియాలో అవమానకరంగా పోస్టులు పెట్టారన్నారు. 20 ఏళ్లకు పైగా తాను కార్పొరేషన్‌లో పని చేస్తున్నానని, విధి నిర్వహణలో ఎప్పుడూ సమస్యలు ఎదుర్కొలేదన్నారు. తోటి ఉద్యోగులు అతనికి సర్దిచెప్పారు. సమాచారంతో అతని కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. అతని భార్య, కుమారుడు కార్పొరేషన్ కార్యాలయానికి పరుగెత్తుకొని వచ్చారు.

లారీలను అడ్డుకొని రైతు నిరసన

పెద్దపల్లి రూరల్, అక్టోబరు 4 : మండలంలోని అందుగులపల్లి గ్రామ శివారులో పెద్దమ్మ ఆలయం వద్ద ఉన్న తన పత్తి పంట బొగ్గు లారీల వల్ల నాశనం అవుతోందని రైతు ఆందోళనకు దిగాడు. కాంట్రాక్టర్‌కు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని గురువారం అటువైపుగా వెళ్తున్న బొగ్గు లారీలు, టిప్పర్‌లను రైతు బర్ల సదయ్య అడ్డుకోని లారీకి అడ్డుగా బైఠాయించారు. ఈసందర్భంగా రైతు మాట్లాడుతూ పత్తి పంట చేతికి వచ్చే సమయానికి రాఘవపూర్ రైల్వే స్టేషన్ పరిధిలోని బొగ్గు డంప్‌కు లారీలు, టిప్పర్‌ల ద్వారా బొగ్గు రవాణా చేస్తున్న కాంట్రాక్టర్ మట్టి రోడ్డుపై కనీసం నీళ్లు చల్లకపోవడంతో దుమ్ము, ధూళీ లేచి పత్తిపంటపై పడి నష్టం వాటిల్లుతోందని, పలుమార్లు సంబంధిత కాంట్రాక్టర్, సిబ్బందికి చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. వెంటనే ఉన్నతాధికారులు చొరవ చూపి పంట నష్టపరిహారం అందించాలని, ఇకపై నష్టం జరగకుండా తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. ఈ ఆందోళనలో గ్రామస్థులు కారే శ్రీనివాస్, మహిళ రైతులు పాల్గొన్నారు.

నేడు వ్యవసాయ సహకార సంఘ భవనం ప్రారంభోత్సవం



పొత్కపల్లిలో ప్రారంభోత్సవానికి సిద్ధమైన నూతన భవనం

ఓదెల, అక్టోబరు 4 : మండలంలోని పొత్కపల్లిలో నిర్మించిన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంతో పాటు గోదాం సముదాయాన్ని శనివారం ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు ప్రారంభిస్తారని సింగిల్‌విండో చైర్మన్ ఆళ్ళ సుమన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం పొత్కపల్లిలో విలేకరులతో సింగల్ విండో చైర్మన్ ఆళ్ళ సుమన్ రెడ్డి మాట్లాడుతూ, అలాగే మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన కళ్యాణలక్ష్మి లబ్ధిదారులకు ఇక్కడే రూ.33లక్షల విలువగల చెక్కులను అందజేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి సహకార సంఘం ప్రాథమిక సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు, హాజరుకావాలని దీనికి ముఖ్యఅతిథిగా జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ అధ్యక్షుడు కొండూరి రవీందర్‌రావు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మూల ప్రేమ్ సాగర్‌రెడ్డి పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి - ఎమ్మెల్యే విజయరమణారావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లిటౌన్, అక్టోబరు 4: బతుకమ్మ దసరా పండుగలు వస్తున్న నేపథ్యంలో గ్రామపంచాయతీల ప్రత్యేక అధికారులు పారిశుధ్యంపై పత్యేక శ్రద్ధ వహించాలని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు సూచించారు. శుక్రవారం స్థానిక నందన గార్డెన్‌లో బతుకమ్మ వేడుకలు, గ్రామపంచాయతీ విధులపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీతో కలిసి విజయరమణరావు నియోజకవర్గ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతంలో ప్రసిద్ధమైన పండుగ బతుకమ్మ అని, ప్రతి గ్రామంలో ఈ వేడుకలు ఘనంగా జరిగేందుకు అవసరమైన ఏర్పాట్లను ప్రత్యేక అధికారులు శ్రద్ధతో చేపట్టాలన్నారు. బతుకమ్మ, దసరా వేడుకల నేపథ్యంలో గ్రామాల్లో అవసరమైన లైటింగ్, బతుకమ్మ ఆటస్థలాలను శుభ్రపరచడం, బతుకమ్మ నిమజ్జనం చేసే చోట లైటింగ్, పారిశుధ్యం వంటి ఏర్పాట్లను ప్రత్యేక అధికారులు పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు సంబంధించి ఎటువంటి కోతలు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నిధులకు ఏదైనా ఇబ్బందులుంటే వెంటనే తన దృష్టికి తీసుకుని రావాలని, బతుకమ్మ వేడుకలలో ఎటువంటి లోటురావడానికి వీలులేదని స్పష్టం చేశారు. రూరల్ ప్రాంతాల్లో విధులు నిర్వహించే పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీవోలు, ఎంపిఓలు నిత్యం క్షేత్రస్థాయిలో పారిశుధ్య పనులను పర్యవేక్షించాలని, అలాగే చెత్త సేకరించి సెగ్రిగేట్ చేయాలని, సెగ్రిగేన్ షెడ్ ద్వారా వర్మి కంపోస్ట్ తయారుచేయాలని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సెగ్రిగేషన్ షెడ్ వినియోగంపై స్పెషల్ ఆడిట్ నిర్వహిస్తామని, అదనపు కలెక్టర్ అరుణశ్రీ పేర్కొన్నారు. గ్రామాల్లో ఎక్కడ ప్లాస్టిక్, చెత్త కనిపించకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో నరేందర్, జిల్లా పంచాయతీ అధికారి వీర బుచ్చయ్య, డివిజనల్ పంచాయతీ అధికారులు, ఎంపీడీవోలు మండల పంచాయతీ అధికారులు, కార్యదర్శులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ధ్రువీకరణ పత్రాలు, నిర్మాణ అనుమతులకు ఆటంకాలు

- రామగుండం నగరపాలక సంస్థలో అప్‌డేట్ కాని 'డిజిటల్ కీ'.. 15 రోజులుగా నిలిచిన సేవలు
- కార్యాలయం చుట్టూ తిరుగుతున్న దరఖాస్తుదారులు

కోల్‌సిటీ, అక్టోబరు 4: రామగుండం నగరపాలక సంస్థలో ఇన్‌చార్జి కమిషనర్ పాలన సాగుతోంది.. కమిషనర్‌గా ఉన్న సీహెచ్ శ్రీకాంత్ గతనెల 19వ తేది నుంచి సెలవు పెట్టి వెళ్లిపోయాడు. బదిలీయత్నాల్లో ఉన్న ఆయన వ్యక్తిగత అవసరాల పేర సెలవు పొడిగించుకుంటూ వస్తున్నారు. మొదట ఆయన స్థానంలో ఎస్ఈ శివానంద్‌కు బాధ్యతలు అప్పగించిన కలెక్టర్ అనంతరం అదనపు కలెక్టర్ అరుణశ్రీకి పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు అప్పగించారు. సాధారణంగా మూడునాలుగు రోజుల సెలవుల తరువాత ఎఫ్ఏసీ ఇచ్చిన అధికారి డిజిటల్ కీని అప్‌డేట్ చేస్తారు. డిజిటల్ కీ ఉంటేనే జనన,మరణ ధ్రువీకరణ పత్రాలు, ఆస్తి పన్నుకు సంబంధించి అసెస్‌మెంట్లు, భవన నిర్మాణ అనుమతులు తదితర పత్రాలు జారీచేసేందుకు అవకాశం ఉంటుంది. గత నెల 19వ తేదిన కమిషనర్ శ్రీకాంత్ సెలవులో వెళ్లినప్పటి నుంచి డిజిటల్ కీ అప్‌డేట్ కాలేదు. అదనపు కలెక్టర్ అరుణశ్రీ కమిషనర్‌గా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ కీ అప్‌డేట్ కావాల్సి ఉంది. సాధారణంగా సంబంధిత ఏజెన్సీ ఒకటి రెండు రోజుల్లోనే ఈ ప్రక్రియ పూర్తిచేస్తుంది. అనివార్య కారణాల వల్ల వాయిదా పడుతూ వస్తున్నది.

దీంతో 15రోజులుగా కార్పొరేషన్ నుంచి ధ్రువ పత్రాలు, అనుమతులకు సంబంధించిన సేవలు నిలిచిపోయాయి. దీంతో పలువురు దరఖాస్తుదారులు పనుల కోసం కార్యాలయం చుట్టూ తిరుగుతూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

రామగుండంలోని పేదల ఇళ్లు కూల్చొద్దు - ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

కోల్‌సిటీ, అక్టోబరు 4: రామగుండంలో అనధికారిక కట్టడాల్లో నివాసముంటున్న పేదల ఇండ్లు కూల్చవద్దని, అదే సమయంలో ప్రభుత్వ భూములు, చెరువులు, నాలాలు ఆక్రమించుకుని అక్రమ వ్యాపారాల కట్టడాలను వదలవద్దని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాత్రి నగరపాలక సంస్థ కార్యాలయంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), ఇన్‌చార్జి కమిషనర్ అరుణ శ్రీతో కలిసి నగర అభివృద్ధిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. సింగరేణి, ఆర్ఎఫ్‌సీఎల్, ఎన్‌టీపీసీ పరిశ్రమలు నగర అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలన్నారు. రామగుండానికి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు, వ్యాపార, వైద్య రంగాల్లో అభివృద్ధి చేసేందుకు మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో అన్నిరకాల సేవలు అందుబాటులోకి రానున్నాయని, ఇప్పటికే రహదారి ఇరుకుగా ఉందన్నారు. మున్సిపల్ కార్యాలయం పక్క నుంచి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి వరకు డబుల్ రోడ్డుగా విస్తరించాలని, అదే విధంగా శారదానగర్ రాజీవ్ రహదారి నుంచి చంద్రబాబు కాలనీ వరకు విస్తరించాలన్నారు. మెయిన్ చౌరస్తా నుంచి కోర్టు వరకు అక్రమ కట్టడాలను తొలగించాలన్నారు. ఐడీఎస్ఎంటీ షాపింగ్ కాంప్లెక్స్‌ను ఆధునీకరించి వినియోగంలోకి తీసుకువచ్చేలా చర్యలుచేపట్టాలని, బుక్కగులాల షాపుల వైపు కాంప్లెక్స్‌లో షటర్లు నిర్మించి వారిని అందులోకి తరలించాలని, అదేవిధంగా షాపింగ్ కాంప్లెక్స్ ముందు ఉన్న అనధికారిక కట్టడాలను నోటీసులు ఇచ్చి తొలగించాలన్నారు. రోడ్డు డెవలప్‌మెంట్ ప్లాంట్ ఆమోదం జరిగిన విధంగా దసరా తరువాత రోడ్డు విస్తరణ చేయాలని, రీగల్ షూమార్ట్ జంక్షన్ అభివృద్ధితోపాటు ఇతర అభివృద్ధి పనులు నిర్వహించాలన్నారు. ఓల్డ్‌అశోక థియేటర్ ఏరియాలో మిగిలిన విస్తరణ పనులు కూడా పూర్తి చేయాలన్నారు. జీఎం ఆఫీస్ నుంచి ఇందిరాగాంధీ జంక్షన్ వరకు రోడ్డు విస్తరణ చేయాలన్నారు. ఇల్లందు బంగ్లా ఏరియా నుంచి గంగానగర్, మున్సిపల్ జంక్షన్ నుంచి పైవింక్లయిన్ రహదారిలో సుందరీకరణ పనులను సింగరేణి నిర్వహించాలని ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ సూచించారు. ఫుట్‌పాత్‌ల ఆక్రమనలను తొలగించాలని, అస్తవ్యస్తంగా వేలాడుతున్న విద్యుత్ తీగలను సరిచేయాలన్నారు. వీధి వ్యాపారులను గుర్తించి వారి వ్యాపారం సజావుగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. రాముని గుండాలు, జనగామ శివాలయం, ఎల్లంపల్లి, సుందిళ్ల బ్యారేజీలు, ఓపెన్‌కాస్టు బొగ్గు గనులు ఉన్నందు వల్ల టూరిజంకు సంబంధించి బృహోత్తర ప్రణాళిక రూపొందించాలన్నారు.టీయూఎఫ్ఐడీసీ, డీఎంఎఫ్‌టీ, ఎస్‌డీఎఫ్ పనులు త్వరిగతిన ప్రారంభించాలన్నారు.

నిర్లక్ష్య పూరితంగా ఆర్ఎఫ్‌సీఎల్ వైఖరి...

ఆర్ఎఫ్‌సీఎల్ పరిశ్రమను ఈ ప్రాంత ప్రజలు ఆహ్వానించారని, కానీ పరిశ్రమ ఈ ప్రాంతం పట్ల నిర్లక్ష్య ధోరణి అవలంభిస్తుందన్నారు. అమ్మోనియా వ్యర్థాలను ఇష్టానుసారంగా వదులుతున్నారని, వీర్లపల్లి శబ్ద కాలుష్యం గురించి పట్టించుకోవడం లేదన్నారు. ఒకరోజు వీర్లపల్లిలో నిద్రించి చూడండి అక్కడ పరిస్థితి అర్థమవుతుందంటూ ఆర్ఎఫ్‌సీఎల్ అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. రాష్ట్ర పరిశ్రమలశాఖ కార్యదర్శి ఆర్ఎఫ్‌సీఎల్ ఉన్నతాధికారులతో మాట్లాడినా కూడా యాజమాన్యం నుంచి సరైన స్పందన రావడం లేదని, ఇది సరైన విధానం కాదన్నారు. త్వరలోనే ఆర్ఎఫ్‌సీఎల్ సీజీఎంతో వచ్చి మాట్లాడుతామని ఆర్ఎఫ్‌సీఎల్ హెచ్ఆర్ మేనేజర్ సోమనాథ్ ఎమ్మెల్యేతో పేర్కొన్నారు.

ఈ సమీక్ష సమావేశంలో మేయర్ బంగి అనీల్ కుమార్, ఆర్ఎఫ్‌సీఎల్ అధికారి ప్రదీప్, ఆర్జీ-1 జీఎం లలిత్‌కుమార్, కార్పొరేషన్ ఎస్ఈ శివానంద్, సెక్రటరీ రాజు, కార్పొరేటర్లు మహంకాళి స్వామి, బొంతల రాజేష్, ముస్తాఫా పాల్గొన్నారు.

పొరపాట్లు లేకుండా కుటుంబ వివరాలు సేకరించాలి

-జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



సర్వే వివరాలను పరిశీలిస్తున్న కలెక్టర్

పెద్దపల్లిటౌన్, అక్టోబరు 4: జిల్లాలో చేపట్టిన ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వే పైలట్ ప్రాజెక్టు కింద ఎటువంటి పొరపాట్లు లేకుండా కుటుంబ వివరాలను సజావుగా సేకరించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. శుక్రవారం పట్టణంలోని 24వ వార్డులో జరుగుతున్న ఫ్యామిలీ డిజిటల్ కార్డు పైలెట్ ప్రాజెక్టు సర్వే ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. సర్వే ద్వారా కుటుంబాల నుంచి సేకరిస్తున్న వివరాలను కలెక్టర్ అడిగితెలుసుకున్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం నిర్దేశించిన సమాచారాన్ని పూర్తిస్థాయిలో కుటుంబం నుంచి సేకరించాలని, వార్డులో ఏ కుటుంబాన్ని విడిచిపెట్టకుండా అందరి వివరాలను పకడ్బందీగా సేకరించి నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. సర్వే పనులు ఈనెల 8లోపు పూర్తిచేయాలని, వార్డులో ఉన్న కుటుంబాల సంఖ్య ఆధారంగా ప్రతిరోజు ఎన్ని కుటుంబాలను కవర్ చేయాలో ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకుని బృందాలు పనిచేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేష్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

డీసీవోగా విధుల్లో చేరిన శ్రీమాల

పెద్దపల్లి, అక్టోబర్ 4 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలిక సెలవుపై వెళ్లి తిరిగివచ్చిన జిల్లా సహకార శాఖాధికారి శ్రీమాలకు తిరిగి ఇక్కడే పోస్టింగ్ ఇవ్వడంతో ఆమె శుక్రవారం విధుల్లో చేరారు. మూడు మాసాల నుంచి డిప్యూటీ రిజిస్ట్రార్ బి రామ్మోహన్ జిల్లా సహకార శాఖాధికారిగా పూర్తిస్థాయి బాధ్యతలను స్వీకరించారు.

అందుబాటులో పొద్దు తిరుగుడు విత్తన చిరు సంచులు

పెద్దపల్లి, అక్టోబర్ 4 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఆహార భద్రత పథకం- నూనె గింజలు పథకం కింద జిల్లాకు 2 క్వింటాళ్ల పొద్దు తిరుగుడు(తిల్లన్ టెక్ సన్-1) విత్తన చిరు సంచులు కేటాయించారని జిల్లా వ్యవసాయ శాఖాధికారి దోమ ఆదిరెడ్డి తెలిపారు. ఒక్కో సంచి 2 కిలోలు ఉంటుందని, ఒక రైతుకు ఒక సంచి మాత్రమే అందజేస్తామన్నారు. జిల్లాకు కేటాయించిన ఈ విత్తనాల్లో 50కిలోలు 25 సంచులను కమాన్‌పూర్ మండలానికి, 150కిలోలు 75సంచుల విత్తనాలను ఓదెల మండలానికి కేటాయించామని పేర్కొన్నారు. ఈ విత్తనాలు కమాన్‌పూర్ మండలం గుండారం, ఓదెల మండలం ఓదెల రైతు వేదికల్లో అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. విత్తనాలు కావాల్సిన రైతులు ఆధార్ కార్డు, పట్టాదారు పాసుపుస్తకం తీసుకుని మండల వ్యవసాయ శాఖాధికారిని గానీ, విస్తీర్ణాధికారిని గానీ సంప్రదించాలని ఆదిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

ఉపాధిహామీ పనులు పకడ్బందీగా నమోదు చేయాలి

- జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి రవిందర్ రాథోడ్

పెద్దపల్లి రూరల్, అక్టోబరు 4 : గ్రామాల్లో చేపడుతున్న ఉపాధిహామీ పనులను పకడ్బందీగా రిజిష్టర్‌లో నమోదు చేయాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి రవిందర్ రాథోడ్ అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో పెద్దపల్లి, అంతర్గాం, ధర్మారం, పాలకుర్తి మండలాల ఫీల్డ్ అసిస్టెంట్‌లతో 2025-26లో చేపట్టాల్సిన ఉపాధిహామీ పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సమావేశానికి జిల్లా గ్రామీణాభివృద్ధి రవిందర్ రాథోడ్ హాజరై మాట్లాడారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీల్లో లక్ష్యానికి అనుగుణంగా మొక్కల పెంపకం చేపట్టాలని, మొక్కల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. అవెన్యూ ప్లాంటేషన్‌లో నాటిన మొక్కలను రక్షించాలని సూచించారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ విజిలెన్స్ అధికారి గణేష్, జిల్లా టెక్నికల్ అధికారి అనిల్, టెక్నికల్ అసిస్టెంట్ గట్టయ్య, ప్లాంటేషన్ సూపర్‌వైజర్ మధుకర్, ఏపీవోలు రవి, రమేష్, కొమురయ్య, రమేష్‌బాబులతోపాటు ఈజీఎస్ జేఈలు, టెక్నికల్ అసిస్టెంట్‌లు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

జాగ్రత్తగా వాహనాలు నడపాలి : సీపీ శ్రీనివాస్



మాట్లాడుతున్న సీపీ శ్రీనివాస్

బెల్లంపల్లి, అక్టోబరు 4: ప్రతిఒక్కరు జాగ్రత్తగా వాహనాలు నడపాలని రామగుండం సీపీ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం స్థానిక హెడ్ క్వార్టర్‌లో కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల వివిధ పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో పోలీసు వాహనాలు నడిపే డ్రైవర్లకు శిక్షణ, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ పోలీసు వాహనాలు నడిపే సమయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా అప్రమత్తతో వాహనాలు నడపాలన్నారు. వాహనం నడిపే సమయంలో చిన్ననిర్లక్ష్యం చేసినా కుటుంబాలు రోడ్డు పాలవుతాయని పేర్కొన్నారు. ఆరోగ్యంపై వ్యక్తిగత శ్రద్ధ వహించాలని, ప్రతి రోజు వాకింగ్, యోగా చేయాలని సూచించారు. చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ కుటుంబీకులతో ఆనందంగా గడపాలన్నారు. పిల్లల భవిష్యత్ కోసం ఆలోచించాలని దిశ నిర్దేశం చేశారు. వాహనాలపై డ్రైవర్లు ఎప్పటికప్పుడు శ్రద్ధవహిస్తూ కండీషన్ ఏవిధంగా ఉందో గ్రహించాలన్నారు. వాహనం నడిపే సమయంలో ఏకాగ్రతతో ఉండాలని, చిన్న నిర్లక్ష్యం, పొరపాటు చేసినా భవిష్యత్ అంధాకరంలోకి వెళ్లిపోతుందన్నారు. రోడ్డు భద్రత నిబంధనలు పాటించి ప్రమాదాల నివారణకు కృషి చేయాలన్నారు. అడిషనల్ డీసీపీ అడ్మిన్ రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్రరావు, బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, ఏఆర్ఏసీపీ సురేందర్‌రావు, వన్‌టౌన్‌సీఐ దేవయ్య, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గుట్కా ప్యాకెట్లు పట్టివేత

హుజూరాబాద్, అక్టోబరు 4: హుజూరాబాద్‌కు చెందిన ఆర్ శ్రీధర్ శుక్రవారం వ్యాన్‌లో గుట్కా ప్యాకెట్లను వరంగల్‌లోని పాన్ షాపులలో సరఫరా చేసేందుకు తీసుకెళ్తున్నట్లు సమాచారం రావడంతో టాస్క్‌ఫోర్స్ సిబ్బంది దాడులు చేశారు. వాహనాన్ని తనిఖీ చేయగా రూ. 8.91లక్షల విలువ చేసే గుట్కా ప్యాకెట్లు పట్టుబడ్డాయి. పాన్‌షాపు యజమాని కృష్ణతో పాటు, సరఫరా చేస్తున్న శ్రీధర్‌ను టాస్క్‌ఫోర్స్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

తిమ్మాపూర్, అక్టోబరు 4: ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి సంస్థ ఆధ్వర్యంలో అక్టోబరు 23వ తేదీ నుంచి అకౌంటింగ్ ట్యాలీలో 30 రోజుల పాటు పురుషులకు ఇచ్చే ఉచిత శిక్షణ కోసం దరఖాస్తు చేసుకోవాలని సంస్థ డైరెక్టర్ డి సంపత్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిలాలోని గ్రామీణ ప్రాంతాల అభ్యర్థులు మాత్రమే అర్హులని, వివరాలకు 98494 11002, 7981151653 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

విద్యుత్ ఉద్యోగుల నిరసన



విద్యుత్ సర్కిల్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న విద్యుత్ జేఏసీ నాయకులు

గణేశ్‌నగర్, అక్టోబర్ 4 : రామగుండం థర్మల్ పవర్‌స్టేషన్‌ను సింగరేణి భాగస్వామ్యంతో ఏర్పాటు చేయడాన్ని నిరసిస్తూ తెలంగాణ విద్యుత్ జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు కరీంనగర్ సర్కిల్ ఆఫీస్ ఆవరణలో కరీంనగర్ విద్యుత్ జేఏసీ ఉద్యోగులు మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన రామగుండం థర్మల్ పవర్‌స్టేషన్ పరిధిలో సింగరేణి యాజమాన్యంతో ఎనిమిది వందల మెగావాట్ల విద్యుత్ ప్లాంటు నిర్మించుటకు అంగీకారం కుదుర్చుకోవడానికి నిర్ణయించారన్నారు. ప్రస్తుతం విద్యుత్ జన్‌కో ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్ని జనరేటింగ్ స్టేషన్లలో మంచి లాభాలు కనబరుస్తున్నాయన్నారు. ప్రభుత్వం మాత్రం సింగరేణి కాలరీస్‌కు పవర్‌స్టేషన్‌ను కట్టబెట్టడం మంచిది కాదన్నారు. విద్యుత్ సంస్థలను నిర్వీర్యం చేయడమే అవుతుందని అన్నారు. యాదాద్రి పవర్‌స్టేషన్‌ను కూడా గుత్తేదారులకు మెయింటెనెన్స్ కొరకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపారు. ఇలాంటి చర్యలు ఎంతమాత్రం సరికావని, చేసిన ఒప్పందాలు విరమించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ జేఏసీ నాయకులు అంజయ్య, భాస్కర్ శ్రీనివాస్, సంపత్‌కుమార్, సుధీర్‌కుమార్, రఘుపతి, శ్రీనివాస్ అధికారులు పాల్గొన్నారు.

ఒకరి ఆత్మహత్యాయత్నం

దండేపల్లి, అక్టోబరు 4: మంచిర్యాల-జగిత్యాల జిల్లాల సరిహద్దులో గల దండేపల్లి మండలం గూడెం సమీపంలో గోదావరి నదిలో శుక్రవారం సాయంత్రం దూకి ఆత్మ హత్య చేసుకునేందుకు యత్నించిన వ్యక్తిని దండేపల్లి, లక్సెట్టిపేట బ్లూకోల్ట్స్ పోలీసులు కాపాడారు. కరీంనగర్ జిల్లా చొప్పదండికి చెందిన నామసాని శ్రీకాంత్ అనే డ్రైవర్ బెల్లంపల్లిలో తన బంధువుల ఇంటికి వెళ్లాడు. అక్కడ గొడవ జరుగడంతో ఆత్మహత్య చేసుకుంటానని చెబుతూ శుక్రవారం అక్కడి నుంచి గూడెం సమీపంలోని గోదావరి నది వద్దకు చేరుకున్నాడు. అక్కడి నుంచి కుటుంబసభ్యులకు వీడియోకాల్ ద్వారా విషయం చెప్పాడు. దీంతో కుటుంబసభ్యులు డయల్ 100కు కాల్ చేసి విషయం చెప్పారు. దండేపల్లి, లక్సెట్టిపేట ఎస్సైలు ఉదయ్‌కిరణ్, సతీష్ బ్లూకోల్ట్స్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. సిబ్బంది గూడెం గోదావరి వంతెన వద్దకు చేరుకొని శ్రీకాంత్ అదుపులోకి తీసుకుని దండేపల్లి పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఎస్సై ఉదయ్‌కిరణ్ కుటుంబ సభ్యులను పిలిపించి అప్పగించారు.

షరతులు లేకుండా రెండు లక్షల రుణమాఫీ చేయాలి

- జగిత్యాలలో అన్నదాతల మహాధర్నా
- వ్యవసాయ మార్కెట్ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ
- కలెక్టరేట్ వద్ద బైఠాయింపు
- హామీలు అమలు చేయాలని డిమాండ్





జగిత్యాలలో ఆందోళన నిర్వహిస్తున్న రైతులు, రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ సత్య ప్రసాద్

జగిత్యాల, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి షరతులు లేకుండా రూ. రెండు లక్షల రుణ మాఫీ అర్హులందరికి చేయడంతో పాటు ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం జగిత్యాలలో రైతులు ఆందోళన నిర్వహించారు. జగిత్యాల జిల్లా రైతు ఐక్య వేదిక పిలుపు మేరకు జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో రైతులు జగిత్యాలకు తరలివచ్చారు. జగిత్యాల పట్టణంలోని వ్యవ సాయ మార్కెట్ కమిటీ కార్యాలయం నుంచి ర్యాలీని ప్రారంభించారు. కొత్త బస్టాండు మీదుగా కలెక్టరేట్ కార్యాలయం వరకు ప్లకార్డులు ప్రదర్శిస్తూ, నినాదాలు చేస్తూ ర్యాలీ జరిపారు. పోలీసులు ముందస్తుగా కలెక్టరేట్ వద్ద బారికేడ్లను ఏర్పాటు చేసి, అదనపు బలగాలను మోహరించడంతో నిరసన వ్యక్తం చేస్తూ అక్కడే రహదారిపై బైఠాయించారు. కలెక్టరేట్ ప్రధాన గేటు వద్ద ధర్నా నిర్వహించారు. సుమారు రెండు గంటల పాటు నిరసన జరిపారు. అనంతరం కలెక్టర్ సత్యప్రసాద్‌కు వినతిపత్రం సమర్పించారు. ఎండ తీవ్రత వల్ల కథలాపూర్ మండలం భూషన్ రావుపేట గ్రామానికి చెందిన ఓ రైతు కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగిన ధర్నాలో పాల్గొని సొమ్మసిల్లి అస్వస్థతకు గురయ్యారు. వెంటనే సదరు రైతుకు ప్రాథమిక చికిత్సను అందించారు. ఈ సందర్భంగా పలువురు రైతు సంఘం నాయకులు మాట్లాడారు. షరతులు లేకుండా రూ. రెండు లక్షల రుణమాఫీ చేయాలని, రైతు భరోసాలో భాగంగా వెంటనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమచేయాలని, ధాన్యం క్వింటాలుకు రూ. 500 బోనస్ ఎటువంటి షరతులు లేకుండా ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లా రైతు ఐక్య వేదిక నాయకులు, జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ప్రభుత్వం కొందరు రైతులకు మాత్రమే రుణమాఫీ చేసి, మరి కొందరిని విస్మరించిందని ఆరోపించారు. వానాకాలం పంట సీజన్‌పూర్తి కావస్తున్నప్పటికీ పంట పెట్టుబడి సాయం అందించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి అద్దంపడుతోందన్నారు. రైతుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకవెళ్లి పరిష్కరింపజేయడానికి ప్రయత్నిస్తానని కలెక్టర్ హామీనివ్వడంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో రైతు ఐక్య వేదిక నాయకులు పన్నాల తిరుపతిరెడ్డి, గడ్డం తిరుపతిరెడ్డి, ఏనుగు రాంరెడ్డి, లక్ష్మారెడ్డి, రాజారెడ్డి, లింగారెడ్డి, మిట్టపల్లి తిరుపతిరెడ్డి, కర్నె రాజేందర్, బందెల మల్లన్న, బద్దం మహేందర్‌రెడ్డి, గడ్డం రాజరెడ్డి, అయిలినేని సాగర్‌రావు, ఏలేటి నర్సింహా రెడ్డి, ఉదగిరి ఆదిరెడ్డి, చిలివేరి తిరుపతి, రమేశ్, సురకంటి అంజిరెడ్డి పాల్గొన్నారు.

యువకుడిపై గొడ్డలితో దాడి

కోరుట్ల, అక్టోబరు 4 : పట్టణంలోని కాల్వ గడ్డ ప్రాం తంలో గురువారం రాత్రి యువ కుడిపై ఇద్దరు వ్యక్తులు గొడ్డలితో దాడికి పాల్పడ్డాడు. పట్టణానికి చెందిన ఫహీం శుక్రవారం రాత్రి కాల్వగడ్డ ప్రాంతంలో మరో ఇద్దరితో గొడవకు దిగాడు. ఈ ఘర్షణలో గొడ్డలితో ఫహీంపై దాడికి పాల్పడటం తో తీవ్ర గాయాలతో అక్కడే పడిపోయాడు. గమనించిన స్థాని కులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోలీసులకు సమాచారం అందించారు. ఫహీంకు చికిత్స అందించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉందని తెలుపడంతో బంధువులు జగిత్యాల ఆసు పత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలిం చారు. తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని పోలీసులు తెలిపారు. అక్రమ ఇసుక తరలింపులో ఫహీం కాలనీకి చెందిన ఇద్దరు వ్యక్తులతో తరుచుగా గొడవ పడేవాడని ఫహీం బంధువులు పేర్కొంటున్నారు.

ఫైనల్‌లో ఉమ్మడి కరీంనగర్ జట్టు



హెచ్‌సీఏ ఫైనల్ మ్యాచ్‌లో మహబూబ్‌నగర్‌తో తలపడనున్న ఉమ్మడికరీంనగర్ జట్టు

కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబరు 4: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వరంగల్‌లో నిర్వహిస్తున్న అంతర్‌జిల్లాల అండర్-19 క్రికెట్ పోటీల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా జట్టు ఫైనల్‌కు చేరుకుంది. శనివారం కరీంనగర్ ఉమ్మడి జిల్లా జట్టు మహబూబ్‌నగర్ జిల్లా జట్టుతో తలపడనున్నది. శుక్రవారం జరిగిన సెమిఫైనల్‌లో నల్గొండ జట్టుపై విజయం సాధించి ఫైనల్‌కు చేరుకున్నది. మొదట టాస్‌గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న కరీంనగర్ జట్టు నిర్ణీత యాభైఓవర్లలో 9వికెట్ల నష్టానికి 299 పరుగులు సాధించి గెలుపొందింది. కరీంనగర్ జట్టునుంచి తక్షిల్ 138 పరుగులు, అక్రాం 79 పరుగులు రిత్విక్ 20 పరుగులు సాధించారు. మ్యాన్‌ఆఫ్‌ద మ్యాచ్‌గా తక్షిల్ ఎంపికయ్యాడని జట్టు మేనేజర్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు తెలిపారు. ఫైనల్‌కు చేరిన జట్టును జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఆగంరావు, మురళీధర్‌రావు, ఉపాధ్యక్షుడు కె మహేందర్‌గౌడ్, అజిత్‌కుమార్ అభినందించారు.

అండర్-14 క్రికెట్ టోర్నీ విజేత కరీంనగర్

- రన్నరప్‌గా రాజన్న సిరిసిల్ల జట్టు



విజేత జట్టు కరీంనగర్

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 4: ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి అండర్ -14 బాలుర క్రికెట్ టోర్నీలో కరీంనగర్ జట్టు విజేత గా నిలిచింది. 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఉమ్మడి కరీంన గర్ జిల్లా స్థాయి అండర్ - 14 బాలుర క్రికెట్ మ్యాచ్ పోటీలు రాజన్న సిరిసిల్ల జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం సిరిసిల్లలో నిర్వహించారు. పోటీలను డీఈవో రమేష్‌కుమార్ ప్రారంభించారు. అనంతరం కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి జిల్లా జట్లు తలపడ్డాయి. నాలుగు జట్లలో కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జట్లు ఫైనల్స్‌కు చేరుకున్నాయి. హోరాహోరీగా సాగిన ఫైనల్స్‌లో కరీంనగర్ జట్టు విజయం సాధించింది. రాజన్న సిరిసిల్ల జిల్లా జట్టు రన్నరప్‌గా సిరిసిల్ల పట్టణ సీఐ కృష్ణ బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి న్నర శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు పూర్మాణి లింగారెడ్డి, సభ్యులు, క్రికెట్ కోచ్ డేవిడ్ సన్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ అధ్యాపకుడికి డాక్టరేట్



జాలిగాం రమేష్

కమాన్‌పూర్, అక్టోబరు 4 : మండలంలోని గుండారం గ్రామంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎకనామిక్స్ అధ్యాపకుడిగా పనిచేస్తున్న జాలిగాం రమేష్ డాక్టరేట్ సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ కాసింరాళ్ల సుధాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేయూలో ప్రొఫెసర్ ఎన్. విజయ పర్యవేక్షణలో తెలంగాణలోని పాక్షిక మండలాల్లో నీటి పారుదల యాంత్రీకరణ, వ్యవసాయ వృద్ధి అనే అంశంపై పరిశోధన చేశారు. ఆయన పరిశోధనకు కేయూ సీవోఈ నరసింహాచారి డాక్టరేట్ ప్రకటించారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకుడు కనకయ్యకు..



జీడీ కనకయ్య

కోల్‌సిటీటౌన్, అక్టోబర్ 4: గోదావరిఖని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో పౌర శాస్త్ర అధ్యాపకులు జీడీ కనకయ్యకు ప్రభుత్వ పాలనా శాస్త్ర విభాగంలో కాకతీయ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. ఉమెన్ పొలిటికల్ ఎగ్జిక్యూటివ్స్ ఇన్ పంచాయతీరాజ్-పర్స్పెషన్ అండ్ పర్ఫార్మెన్స్ ఇన్ వరంగల్ డిస్ట్రిక్ట్- ఏ స్టడీ అనే అంశంపై డాక్టర్ టీవీ సుజాత కుమారి పర్యవేక్షణలో పరిశోధన చేసి సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించిన కనకయ్యకు కాకతీయ యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసర్ ఎస్.నర్సింహాచారి డాక్టరేట్ ప్రకటించారు. ఉమ్మడి వరంగల్ జిల్లా స్టేషన్ ఘనాపూర్ మండలం కేంద్రానికి చెందిన కనకయ్య గోదావరిఖని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తున్నారు. కాగా శుక్రవారం కళాశాల ఆవరణలో కనకయ్యను ప్రిన్సిపాల్ సంజీవయ్య, అధ్యాపకులు బృందం అభినందించారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 4 : ఎల్లారెడ్డిపేట మండలం కోరుట్లపేటలో తాళం వేసిన గంద్ర ధర్మారావు ఇంట్లో చోరీ జరిగినట్లు పోలీసులు శుక్రవారం తెలిపారు. ఇంటి తాళం బద్దలుకొట్టిన దొంగలు లోనికి ప్రవేశించి బీరువాను ధ్వంసం చేశారని పేర్కొన్నారు. రూ.1.50 లక్షల విలువైన బంగారు ఆభరణాలు, రూ.15 వేల నగదు ఎత్తుకెళ్లినట్లు చెప్పారు. ధర్మారావు గత నెల 30న కుటుంబసభ్యులతో కలిసి ఇంటికి తాళం వేసి హైదరాబాద్‌కు వెళ్లాడని పేర్కొన్నారు. శుక్రవారం స్వగ్రామానికి తిరిగి వచ్చే సరికి ఇంటి తాళం పగులకొట్టి కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు.

కోరుట్ల ఎస్సై సస్పెన్షన్

జగిత్యాల క్రైం , అక్టోబరు 4: జగిత్యాల జిల్లాలోని కోరుట్ల-2 ఎస్సైగా పనిచేస్తున్న శ్వేతను సస్పెండ్ చేస్తూ మల్టీజోన్-1 ఐజీ చంద్రశేఖర్ రెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. జగిత్యాల జిల్లా కేంద్రానికి చెందిన బొల్లారపు శివ ప్రసాద్(35) అనే యువకుడు ఓ కేసు విషయంలో ఎస్సై శ్వేత వేధింపులు భరించలేక ఆత్మహతాయయత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ గత నెల 26న మృతి చెందాడు. ఈ ఘటనలో ఎస్సైని ఎస్పీ కార్యాలయానికి అటాచ్ చేశారు. తాజాగా ఎస్సైని సస్పెండ్ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

వరద కాలువలో మృతదేహం లభ్యం

కథలాపూర్, అక్టోబరు 4 : మండలంలోని చింతకుంటకు చెందిన నేతుల మల్లేశ్ అనే యువకుడు రెండు రోజుల కిందట అదృశ్యం కాగా శుక్రవారం వరదకాలువలో శవమై కనిపించాడు. సొంత బావ హతమార్చినట్లు పోలీసుల విచారణలో వెల్లడి కాగా మృతదేహం కోసం రెండు రోజులుగా అన్వేషిస్తున్నారు. మేడిపల్లి మండలం విలాయతాబాద్ శివారులో శవం తేలి కనిపించడంతో ఎస్సై నవీన్ నేతృత్వంలో సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. వైద్య సిబ్బంది అక్కడికే వచ్చి పోస్టుమార్టం నిర్వహించారు. మృతదేహం లభ్యమైన ప్రదేశానికి కోరుట్ల సీఐ సురేశ్, ఎస్సై నవీన్ సహా సిబ్బంది వెళ్లారు.

శ్రీరాంసాగర్‌కు కొనసాగిన వరద

జగిత్యాల, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో ఎగువ ప్రాంతం నుంచి వరద నీరు రావడం శుక్రవారం కొనసాగింది. ప్రస్తుతం ఎస్సారెస్పీలోకి 34,221 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులో ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, సాగు నీటి కాలువలు, ఇతర అవసరాలకు ప్రాజెక్టు నుంచి 34,221 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్య

కోల్‌సిటీ, అక్టోబరు 4: గోదావరిఖని లెనిన్‌నగర్‌లో నివాసముండే తాండ్ర నితిన్(23) అనే యువకుడు శుక్రవారం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. హైదరాబాద్‌లో ఒక ప్రైవేట్ కాలేజీలో డిప్లొమా చదువుతున్న నితిన్ రెండు నెలలుగా గోదావరిఖనిలో ఉంటున్నాడు. మద్యానికి బానిసై జల్సాలకు అలవాటు పడి నిత్యం డబ్బుల కోసం తల్లిదండ్రులను వేధిస్తుండేవాడు. తాను కంప్యూటర్ కోర్సు నేర్చుకుంటానని, లక్ష కావాలని అడుగగా, ఆ డబ్బుతో జల్సాలు చేస్తాడని తాను ఇవ్వలేదని తండ్రి గిప్సన్‌పాల్ పేర్కొన్నాడు. దీంతో రెండు రోజులుగా నితిన్ ఎవరితో మాట్లా డడం లేదని, శుక్రవారం తాను ఇంట్లో లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. తండ్రి ఆటో డ్రైవర్‌గా పని చేస్తుండగా, తల్లి అంగన్‌వాడీ ఆయాగా పని చేస్తున్నది. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా రెండో రోజు దేవి నవరాత్రోత్సవాలు

- బ్రహ్మచారిణి రూపంలో అమ్మవారి దర్శనం



ధర్మపురిలో..



వేములవాడలో..



కొండగట్టులో..

ధర్మపురి, అక్టోబరు 4: ధర్మపురి లక్ష్మీ నృసింహ స్వామి, అనుబంధ శ్రీరామ లింగేశ్వర స్వామి ఆలయంలో దేవి నవరాత్రోత్సవాలు రెండవరోజు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ వేదపండితులు మంత్రోచ్ఛరణల మధ్య ప్రత్యేక పూజలు చేశారు. దుర్గాదేవి నవ శక్తులలో ద్వితీయ స్వరూపం అయిన అమ్మవారలు పసుపు రంగు వస్త్రాలతో, మల్లె పూలు, బిల్వపత్రి దండలు ధరించి బ్రహ్మచారిణి రూపంలో భక్తులకు దర్శనం ఇచ్చింది. భక్తులు అమ్మవారలను దర్శనం చేసుకున్నారు. ఇదిలా ఉండగా సాయంత్రం శ్రీయోగ, ఉగ్ర నరసింహస్వామి వారల సేవలను శేష వాహనంపై పురవీధుల గుండా ఊరేగించారు. సాయంత్రం శ్రీ రామ లింగేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారలకు షోడషోపచార పూజతో హారతి, మంత్ర పుష్పం, తీర్థ, ప్రసాద వితరణ జరిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఉపప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, ఆలయ సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

వేములవాడ కల్చరల్, అక్టోబరు 4 : రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు శుక్రవారం పార్వతీరాజ రాజేశ్వరదేవి అమ్మవారు బ్రహ్మచారిణి అలంకా రంలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేక వేదికపై బ్రహ్మచారిణి అలంకారంలో ఉన్న అమ్మ వారిని పలురకాలు పూవులతో అందంగా అలంకరించారు. రాజన్న ఆలయానికి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని తరించారు.

కొండగట్టులో గాయత్రిదేవిగా..

మల్యాల, అక్టోబరు 4: కొండగట్టు అంజన్న సన్నిధిలో జరుగుతున్న దుర్గాదేవి శరన్నవ రాత్రోత్సవాల్లో భాగంగా రెండవ రోజు శుక్రవారం అమ్మవారు గాయత్రిదే విగా భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించగా ఆలయ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

స్వచ్ఛ శుక్రవారం

ఎలిగేడు, అక్టోబర్ 4: మండలంలోని 12గ్రామాల్లో స్వచ్ఛ శుక్రవారం నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శులు అంజలి, పాపన్న, హరిబాబు, లలిత, పున్నమ య్య, శివకుమార్, శ్రవణ్‌కుమార్‌శిరీష, మహ్మద్ షైనోద్దీన్, మహేష్, సురేష్, ఐకేపీసీసీలు ఆనందర్, జ్యోతి, మల్లేశం, వివోఏ, హెల్త్ సిబ్బంది, అంగన్వాడీ టీచర్స్ పాల్గొన్నారు.

'కేసుల పేరిట నాటకం'

మంథని, అక్టోబర్ 4: మంథనిలో అక్రమ వసూళ్లకు పాల్పడిన కాంగ్రెస్ నేత ఇనుముల సతీష్‌ను తన చెప్పు చేతల్లో ఉంచుకోవటానికి మంత్రి శ్రీధర్‌బాబు కేసుల పేరిట నాటకం ఆడారని బీఆర్ఎస్ నేత తగరం శంకర్‌లాల్ ఆరోపించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. సతీష్‌ను మంత్రి శ్రీధర్‌బాబే కాపాడుతున్నారన్నారు. రాజకీయ లబ్ధి కోసం మాత్రమే సతీష్‌పై కాంగ్రెస్ పార్టీ కేసులు పెట్టించారని, ఫిర్యాదు చేసిన బాధితులు బయపడుతున్నారన్నారు. నేతలు ఏగోళపు శంకర్‌గౌడ్, కనవేన శ్రీనివాస్, పెగడ శ్రీనివాస్, అలుగువెల్లి వీరారెడ్డిలు పాల్గొన్నారు.

ఏడీఏ క్షేత్రస్థాయి పర్యటన

ముత్తారం, అక్టోబరు 4: మండల కేంద్రంలో వరి పంట పొలాలను మంథని ఏడీఏ అంజని శుక్రవారం క్షేత్ర స్థాయిలో పర్యటించారు. రైతులకు సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. ఏవో అనూష, ఏఈవో పాల్గొన్నారు.

ఆదివారంపేట్‌లో అధికారుల పర్యటన

రామగిరి, అక్టోబరు 4: మండలంలోని ఆదివారంపేట్‌లో శుక్రవారం ఎస్ఎల్ఎం బృందం సభ్యులు బాలమురళి, సునీల్‌లు పర్యటించారు. గ్రామపంచాయతీ పరిధిలో జరుగుతున్న ఎంజీఎన్ఆర్ఈజీఎస్, ఎస్‌హెచ్‌జీ గ్రూప్స్ గ్రామపంచాయతీలో వస్తున్న పెన్షన్ల వివరాలను అడిగితెలుసుకున్నారు. ఏపీడీసత్యనారాయణ, ఎండీవో శైలజారాణి, విజిలెన్స్ అధికారి కొమురయ్య, ఎస్‌బీఎమ్ రాఘవులు, ఈసీ లక్ష్మణ్, ఈసీ లక్ష్మణ్, ఏపీఎం స్వరూప, టీఏలు సుప్రియ, అఖిల, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన

పెద్దపల్లి రూరల్, అక్టోబరు 4: మండలంలోని చీకురాయి రైతు వేదికలో గురువారం ఆయిల్‌పామ్ పంట సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి అలివేణి, ఏఈవో వినయ్‌కుమార్, తిరుపతి, సాంబయ్య, లక్ష్మణ్, రాజేశం, కొంరయ్య పాల్గొన్నారు.

ఓదెల : మండలంలోని హరిపురంలో ఆయిల్ పామ్ సాగుపై అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఏవో భాస్కర్, ఏఈవో రాకేష్, అరవింద్, రైతులు పాల్గొన్నారు.

ముత్తారం : మండలంలోని పారుపల్లి గ్రామపంచాయతీలో రైతుకలు వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఆయిల్‌పామ్ పంటపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ఏవో అనూష ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఆసక్తి గల రైతులు విస్తరణ అధికారిని సంప్రదించాల్సిందిగా కోరారు.

పాలకుర్తి : మండలం పరిధిలోని రాణాపూర్ గ్రామంలో శుక్రవారం ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన కల్పించారు. మండల వ్యవసాయ శాఖ అధికారి బండి ప్రమోద్ కుమార్ మాట్లాడారు. వ్యవసాయ విస్తరణ అధికారి బాలురి శశిధర్‌రైతులు మిరియాల చంద్రారెడ్డి,బయ్యపు జగన్మోన్ రెడ్డి,ఆడెపు శ్రీనివాస్, బాలసాని కుమార్, జాజిమొగ్గల రాజయ్య, కట్కూరి దయాకర్‌రెడ్డి పాల్గొన్నారు. అలాగే 8 ఎకరాల సాగుకు ముందుకు వచ్చిన మందిళ్ల మోహన్ రెడ్డి,బయ్యపు మల్లారెడ్డిలను సత్కరించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

సుల్తానాబాద్, అక్టోబర్ 4: సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన పెద్ది పార్థు అనే విద్యార్థి రాష్ట్ర స్థాయి కరాటే పోటీలకు ఎంపికయ్యాడు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్ త్వైక్వాండో కరాటే పోటీలు శుక్రవారం జగిత్యాలలో జరిగాయి. పోటీలలో జిల్లా తరపున సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వృత్తి విద్యా కోర్సు చదువుతున్న పెద్ది పార్థు అండర్ 19 విభాగంలో పోటీ పడి ప్రథమ స్థానంలో నిలిచాడు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన పార్థును ప్రిన్సిపాల్ రామచంద్రారెడ్డి అభినందించారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

యైటింక్లయిన్‌కాలనీ, అక్టోబరు 4: కాలనీలోని తెలంగాణ చౌరస్తా నుండి ఆటో ట్రాలీ అడ్డా వరకు సీసీ రోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం కార్పొరేట్ శంకర్‌నాయక్ ప్రారంభించారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గుండేటి రాజేష్, నాయకులు చాట్ల సదానందం, దేవనపల్లి చక్రపాణి, తిరుపతిరెడ్డి, అనుము రాములు, సారయ్యానాయక్‌పాల్గొన్నారు.



త్రినిటీ బీఈడీ కళాశాలలో బతుకమ్మ వేడుకలు..



గాయత్రి డిగ్రీ కళాశాలలో..

విద్యాసంస్థల్లో బతుకమ్మ సంబరాలు

పెద్దపల్లి కల్చరల్, అక్టోబరు 4 : జిల్లాకేంద్రంలోని త్రినిటీ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ బీఈడీ కళాశాలలో శుక్రవారం బతుకమ్మ సంబరాలు ఘనంగా జరిగాయి. టీచర్ ట్రైనీలు స్వయంగా ఇంటి వద్ద నుండి తంగేడు పువ్వుతో పాటు బీరపూలను కళాశాలకు తీసుకువచ్చి కళాశాల ప్రాంగణంలోని బతుకమ్మలు పేర్చి ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. సంప్రదాయ దుస్తులను ధరించి బతుకమ్మ పాటలు పాడుతూ ఆటలాడి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం బతుకమ్మలను నిమజ్జనం చేసి సత్తు పిండి వాయినాన్ని పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో త్రినిటీ బిఈడి కళాశాల ప్రిన్సిపాల్ బుర్ర తిరుపతి అధ్యాపకులు దిలీప్ శర్మ, మధుకర్, పి తిరుపతి, రమేష్ తదితర అధ్యాపకులు, ఛాత్రోపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే త్రినిటీ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన సంబరాలలో ఇంజనీరింగ్ విద్యార్థులతో పాటు ప్రిన్సిపాల్ మనీ గణేషన్ డైరెక్టర్ అశోక్ కుమార్, వంశీ, ఏవో సురేష్, హెచ్‌వోడీలు, అధ్యాపకులు పాల్గొన్నారు. గాయత్రి డిగ్రీ కళాశాలలో జరిగిన బతుకమ్మ వేడుకల్లో విద్యాసంస్థల చైర్మన్ అల్లంకి శ్రీనివాస్‌తో పాటు ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొని బతుకమ్మ సంబరాలను ఘనంగా జరుపుకున్నారు.

పెద్దపల్లి రూరల్ : పెద్దపల్లి మదర్ థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థినులు, ఉపాధ్యాయులు బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ అడవల్లి నవత బతుకమ్మ వేడుకలను ప్రారంభించారు. ప్రిన్సిపాల్ శ్రీనివాస్, పవన్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

సుల్తానాబాద్ : సుల్తానాబాద్ శ్రీవాణి డిగ్రీ, పీజీ కళాశాలలో శుక్రవారం బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బతుకమ్మలను ఆకర్షణీయంగా తయారు చేసిన విద్యార్థినులకు విద్యా సంస్థల డైరెక్టర్ రేకులపల్లి సుష్మ శశాంక బహుమతులు ప్రదానం చేశారు. అలాగే తొమ్మిద రకాల నైవేద్యాలు సమర్పించిన అమ్మ వారికి సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రెటరీ శశాంక, ప్రిన్సిపాల్స్ బండారి కమలాకర్, బాలసాని శ్రీనివాస్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మదర్ థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాలలో..



శ్రీవాణి డిగ్రీ, పీజీ కళాశాలలో..

అమ్మవారి సన్నిధిలో మంత్రి, ఎమ్మెల్యే పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న మంత్రి శ్రీధర్‌బాబు



చండీ హోమం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్, కుటుంబ సభ్యులు

మంథని, అక్టోబర్ 4: తెలంగాణ రాష్ట్రంలోని ప్రజలంతా సుఖ సంతోషాలతో జీవించాలని మంత్రపురి శ్రీమహాలక్ష్మి అమ్మవారిని కోరుకున్నట్లు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు వెల్లడించారు. శుక్రవారం అమ్మవారి ఆలయంలో జరుగుతున్న దేవీశర్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంత్రి శ్రీధర్‌బాబు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు పంటలు పండి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వారి జీవన విధానం కొనసాగాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. ఆయన వెంట మంథని మున్సిపల్ చైర్‌పర్సన్ పెండ్రి రమ-సురేష్‌రెడ్డి, కాంగ్రెస్ నేతలు వొడ్నాల శ్రీనివాస్, ముస్కుల సురేందర్‌రెడ్డిలు ఉన్నారు. కాగా, మంథనిలో మున్సిపల్ వైస్‌చైర్మన్ శ్రీపతి బానయ్య తల్లి, మండలలోని వెంకటాపూర్‌లో కాంగ్రెస్ నేత కుడుదుల వెంకన్న తల్లి ఇటీవల మృతి చెందగా మంత్రి శ్రీధర్‌బాబు శుక్రవారం పరామర్శించారు.

గోదావరిఖని : దేవి నవరాత్రులను పురస్కరించుకుని రామగుండం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం చండీ హోమం నిర్వహించారు. ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్, మనాలీ ఠాకూర్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలందరికి అమ్మవారి ఆశీస్సులు ఎళ్లకాలం ఉండాలని, అందరూ ఆయురారోగ్యాలతో, సుఖ శాంతులతో ఉండాలని వేడుకున్నట్లు పేర్కొన్నారు. ఈ హోమంలో ఆర్‌జీ-1 జీఎం లలిత్‌కుమార్, ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు, పలువురు కార్పొరేటర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సుల్తానాబాద్ : దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సుల్తానాబాద్ పట్టణంలోని జవహర్‌నగర్‌లో గాయత్రిదేవి అవతారంలో అమ్మవారు దర్శనమిచ్చా రు. ఈ సందర్భంగా అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే సుల్తానాబాద్ పట్టణంలోని శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలోని భవానీ శంకర దేవాలయంలో, పాత జెండా, వైశ్యభవన్‌లోని వాసవిమాతా ఆలయంలో, కనుకులలోని అభయాంజనేయ స్వామి ఆలయంతో పాటు పలు గ్రామాల్లో దుర్గాదేవీ విగ్రహాల వద్ద పూజలు నిర్వహించారు.

మహిళల రక్షణ కోసం ప్రత్యేక నిఘా

కోల్‌సిటీటౌన్, అక్టోబరు 4: మహిళలు, విద్యార్థినుల రక్షణ కోసం పోలీస్ శాఖ ప్రత్యేకంగా నిఘా ఉంచిందని షీటీమ్ ఇన్‌చార్జి ఏఎస్ఐ మల్లన్న అన్నారు. శుక్రవారం గోదావరిఖనిలోని కృష్ణవేణి వికాస్ జూనియర్ కళాశాలలో షీటీమ్ విభాగం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ మల్లన్న మాట్లాడుతూ మహిళల రక్షణ కోసం ప్రతి రోజు బస్టాండ్, ప్రధాన చౌరస్తాలో, రద్దీ ప్రదేశాల్లో, కళాశాలల వద్ద షీటీం ఉంటుందని తెలిపారు. ఎవరైనా వేధింపులకు గురిచేస్తే మహిళలు, విద్యార్థినులు భయపడకుండా 6303923700 నంబర్‌కు ఫోన్ చేసి సమస్యను తెలపాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. లోన్ యాప్స్, ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆన్‌లైన్ మోసాలకు గురైతే సైబర్ క్రైమ్ నబర్ 1930కి సమాచారం ఇవ్వాలని, ఏదైనా ప్రమాదం ఉన్నట్లయితే బెదిరింపులకు గురైతే వెంటనే 100 నంబర్‌కు డయల్ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో షీటీం సిబ్బంది స్నేహలత, సురేష్, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియ తనిఖీ



సర్టిఫికేట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి కల్చరల్, అక్టోబరు 4: పెద్దపల్లి పట్టణంలోని ఎమ్మార్సీ కేంద్రంలో డీఎస్సీ సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియను కలెక్టర్ కోయ శ్రీహర్ష శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 93 పోస్టులకు గాను 1:3 నిష్పత్తి కింద ఎంపిక చేసిన 202 డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికేషన్ వెరిఫికేషన్ కోసం ఆరు కౌంటర్లను ఏర్పాటు చేశామని తెలిపారు. ఇప్పటికి 177 మంది అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పూర్తయిందని, మిగిలిన 25 మంది అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ శనివారం పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఆయన వెంట జిల్లా విద్యాశాఖ అధికారి డి మాధవి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

న్యాయవాదులు ఓటర్లుగా నమోదు చేసుకోవాలి

- మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి

పెద్దపల్లిటౌన్, అక్టోబరు 4: న్యాయవాదులందరూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక కోసం ఓటర్లుగా నమోదు చేసుకోవాలని మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి సూచించారు. శుక్రవారం సబ్ కోర్టు న్యాయవాదులతో ఎమ్మెల్సీ ఎన్నికల ఎన్‌రోల్‌మెంట్‌లో భాగంగా శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో గుజ్జుల మాట్లాడారు. ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా పెద్దపల్లిలో కోర్టు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు. గతంలో ఎమ్మెల్యేగా ఎంతో అభివృద్ధి చేశానని, ఎవరిని ఇబ్బందులకు గురి చేయలేదని వివరించారు. న్యాయవాదులందరూ తాము ఎన్‌రోల్‌మెంట్ చేయడమే కాకుండా కొత్తగా డిగ్రీ పట్టా పొందిన వారిని ఓటర్లుగా నమోదు చేయించాలని సూచించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు లకిడి భాస్కర్, శ్రీనివాస్, సీ సత్యనారాయణరెడ్డి, మల్లారెడ్డి, దాసరి రమణారెడ్డి, హన్మాన్ సింగ్, సంతోష్‌బాబ్జీ, పల్లె సదానందం, పర్శ సమ్మయ్య, వెల్లంపల్లి శ్రీనివాస్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ నియామకాల్లో మోసం చేస్తే సహించం

- ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు మంథని చందు మాదిగ

పెద్దపల్లిటౌన్, అక్టోబరు 4: ఉద్యోగ నియామకాల్లో మాదిగలను మోసం చేస్తే సహించమని ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు మంథని చందు మాదిగ హెచ్చరించారు. పెద్దపల్లి ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ ప్రకారం ఉద్యోగ నియామకాలు చేపడతామని, అవసరమైతే అందుకోసం ఆర్డినెన్సు తీసుకువస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ రెండు గడిచిపోయిందన్నారు. కానీ వర్గీకరణ లేకుండానే ఉద్యోగాలు భర్తీ చేస్తూ మాదిగలను మోసం చేస్తున్నారని విమర్శించారు. సీఎం వైఖరికి నిరసనగా ఈనెల 9న పెద్దపల్లి బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు నిరసన ప్రదర్శన చేపట్టనున్నట్లు తెలిపారు. మాదిగ, మాదిగ ఉపకులాల విద్యార్థి విభాగం, నిరుద్యోగులు నిరసన ప్రదర్శనలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి పొట్ల రమేష్ మాదిగ, ఎంఎస్పీ జిల్లా అధికార ప్రతినిధి సిరిసిల్ల శంకర్ మాదిగ, నాయకులు అంబాల నరేష్, పల్లె బాపు, మడిపల్లి దశరతం, కొండ్ర వివేక్, దాసరి కిషన్, బచ్చల రజినీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు మంత్రి పరామర్శ

రామగిరి, అక్టోబరు 4: మండంలోని రామయ్యపల్లి, లద్నాపూర్ గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన కుటుంబాలను ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు శుక్రవారం పరామర్శించారు. రామయ్యపల్లిలో ఆరెల్లి కొంరయ్య తండ్రి ఆరెల్లి వెంకటి, లద్నాపూర్‌లో బర్లశ్రీనివాస్ తండ్రి బర్ల శంకరయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు, కుటుంబాలను ఓదార్చారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

మైనింగ్ యూనివర్సిటీ ఏర్పాటుకు కృషి

కళ్యాణ్‌నగర్, అక్టోబరు 4: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు అవకాశం ఇస్తే రామగుండంలో మైనింగ్ యూనివర్సిటీ ఏర్పాటుకు కృషి చేస్తానని పట్టభద్రుల ఎమ్మెల్సీ ఆశావహుడు వీ నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం గోదావరిఖనిలో పలు ప్రైవేట్, ప్రభుత్వ కళాశాలల లెక్చరర్లు, బార్ అసోసియేషన్ ప్రతినిధులతో సమావేశమయ్యారు. పారిశ్రామిక ప్రాంతంలోని సింగరేణి, ఎన్‌టీపీసీ, ఆర్ఎఫ్‌సీఎల్‌లో స్థానిక యువతకు 80శాతం ఉద్యోగాలు ఇచ్చేలా కృషి చేస్తానన్నారు. ఓటరు నమోదుపై అవగాహన కల్పించి రానున్న పట్టభద్రుల ఎన్నికల్లో తనకు మద్దతు ప్రకటించాలని కోరారు.

అల్ఫోర్స్ ఆధ్వర్యంలో ఉచిత కోచింగ్ సెంటర్లు

సుల్తానాబాద్, అక్టోబరు 4: ప్రతి జిల్లా కేంద్రంలో ఉచిత స్టడీ సెంటర్లను ఏర్పాటు చేస్తామని అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత నరేందర్‌రెడ్డి తెలిపారు. సుల్తానాబాద్ ఆర్యవైశ్య భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై అవగాహన కల్పించారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఉచితంగా ఎన్‌రోల్‌మెంట్ నిర్వహిస్తున్నామని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొమురవెల్లి భాస్కర్, పల్లా మురళి, అల్లెంకి సత్తన్న, కిషన్, నాగమల్ల ప్రశాంత్, శివనాద్రి ప్రసాద్, మాడూరి సందీప్ తదితరులు పాల్గొన్నారు.

యువత వ్యాపారాల్లో రాణించాలి



సూపర్ బజార్‌ను ప్రారంభిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

కమాన్‌పూర్, అక్టోబరు 4 : యువత వాణిజ్య వ్యాపారాల్లో రాణించాలని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. శుక్రవారం కమాన్‌పూర్ ఎక్స్‌రోడ్ వద్ద కాల్వశ్రీరాంపూర్ నాగరాజు, రమేష్ సూపర్‌బజార్‌ను పెట్టడంతో మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత ఉద్యోగాలపై ఆధారపకుండా వాణిజ్య, వ్యాపారాల్లో రాణించాలని పేర్కొన్నారు. వ్యాపారాల్లో మంచి లాభాలు గడించాలన్నారు. ప్రతి ఒక్కరికి ఉద్యోగం దొరకాలంటే ఈ రోజుల్లో చాలా కష్టంగా మారిందని, దీంతో యువత వ్యాపారాల వైపు మొగ్గుచూపుతున్నారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వైనాల రాజు, సింగిల్‌విండో చైర్మన్ ఇనగంటి భాస్కర్‌రావు, మాజీ ఎంపీపీ మల్యాల రామచంద్రగౌడ్, మాజీ సర్పంచ్ ఆకుల ఓదెలు, కటకం రవీందర్, రంగు సత్యం, అనవేణి లక్ష్మీరాజ్యం తదితరులు ఉన్నారు.



కోల్‌బెల్ట్‌లో విప్లవ బీజాలు నాటిన అర్జున్‌రావు

సంస్మరణ సభలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

గోదావరిఖని, అక్టోబరు 4: గోదావరి లోయ బొగ్గు గని కార్మిక సంఘం(ఐఎఫ్‌టీయూ) నిర్మాణం బాధ్యుల్లో ఒకరైన అర్జున్‌రావు సంస్మరణ సభ శుక్రవారం స్థానిక ఒక ప్రైవేట్ హోటల్‌లో జరిగింది. ఈ సంస్మరణ సభకు మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌తోపాటు నాలుగు దశాబ్దాల క్రితం ఈ ప్రాంతంలో ఎంఎల్ గ్రూపుల్లో పనిచేసిన ప్రముఖులందరూ హాజరయ్యారు. ఈ సభలో పాల్గొన్న కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ విప్లవాలకు నెలవైన గోదావరిఖని ప్రాంతంలో సింగరేణి కార్మికోద్యమం తొలితరం నాయకుడు అర్జున్‌రావు అని చెప్పారు. 1975నుంచి 2002మధ్యకాలంలో ఐఎఫ్‌టీయూ నాయకుడిగా నిర్మాణంలో బాధ్యుడిగా అర్జున్‌రావు ఈ ప్రాంతంలో విప్లవ బీజాలు నాటాడని అన్నారు. ఆయన పని చేస్తున్న కాలంలో ఎంతో మందికి విప్లవ చైతన్యం అందించాడని, ఎంత నిర్బంధం ఏర్పడినా విప్లవోద్యమమే లక్ష్యంగా పనిచేశాడన్నారు. అర్జున్‌రావు సహచరులు ఎక్కడెక్కడో ఉన్నప్పటికీ ఆయనకు నివాళులర్పించేందుకు ఇంత మంది రావడం పాత రోజులను గుర్తుకు తెస్తుందన్నారు. ఈ సందర్భంగా ఈశ్వర్ ఉద్యమ ప్రస్థానాన్ని, సంబంధాలను, పోరాటాలను వివరించారు. అప్పుడు ఉద్యమంలో పని చేసినవారంతా ప్రస్తుతం మామూలు జీవితాన్ని గడుపుతున్నారని, అయినప్పటికీ విప్లవోద్యమాన్ని కాంక్షిస్తూ కొనసాగుతున్నారని చెప్పారు. అర్జున్‌రావు ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలన్నారు. విప్లవోద్యమాల నిర్మాణాలకు ఇప్పుడు పరిస్థితులు అనుకూలంగా లేకపోయినప్పటికీ దళిత, బహుజనుల ఉద్యమాల నిర్మాణం జరుగాల్సి ఉందని ఈశ్వర్ చెప్పారు. అందుకు అందరం కృషి చేయాలని ఆయన కోరారు. ఏఎస్‌పీరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సంస్మరణ సభలో మాజీ శాసనసభ్యుడు కోరుకంటి చందర్, పీ విఠల్‌రెడ్డి, బొజ్జ బిక్షమయ్య, మల్లేపల్లి లక్ష్మయ్య, మంథని లక్ష్మయ్య, బోనగిరి నర్సింగ్, బంగారు పాండు, కెంగర్ల మల్లయ్య, కనకం శ్యాంసన్, ఐ కృష్ణ, కే రాజన్న, పులి మోహన్, మాదాసు రామమూర్తి, మేకల మల్లేషం, పెద్దంపేట శంకర్, శంకర లింగం, సత్యనారాయణరెడ్డి, ఈ నరేష్, బీ అశోక్, కే సునీల్, ఎస్ మల్లేష్, రాజేందర్ పాల్గొన్నారు. ఈ సభలో అరుణోదయ కళాకారులు బతుకుల రాజన్న, పల్లె లింగన్న, కాసర్ల మల్లేష్ పాటలు సభను ఉత్తేజపరిచాయి.

ఖజానాను ఖాళీ చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వం

- రామగుండానికి పూర్వ వైభవం తెచ్చేందుకు ప్రణాళికలు - ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

గోదావరిఖని, అక్టోబరు 4: పదేళ్ల రాష్ట్రాన్ని పాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం ఖజానాను గుల్ల చేసిందని, రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిందని రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ పేర్కొన్నారు. శుక్రవారం గోదావరిఖని పట్టణంలోని తిలక్‌నగర్ జంక్షన్ అభివృద్ధి పనులతో పాటు పరుశరాంనగర్, విఠల్‌నగర్ ఏరియాల్లో సింగరేణి ఆధ్వర్యంలో నిర్మించిన ఆర్‌ఓ ప్లాంట్లను ఆయన ఆర్‌జీ-1 జీఎం లలిత్ కుమార్‌తో కలిసి ప్రారంభించారు. తిలక్‌నగర్ జంక్షన్ విస్తరణ పనులకు ట్రాక్టర్‌తో మట్టి చదును చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలలో ఒక్కొక్కటిగా అమలుపరుస్తూ వస్తుందన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా అధిగమించి ముందుకు పోతుందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ప్రతి ఇంటికి 200యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ.500లకే గ్యాస్, రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితి రూ.10 లక్షలకు పెంచడంతో పాటు రైతులకు రుణమాఫీ చేయడం జరిగిందన్నారు. రైతులకు రుణమాఫీ జరుగలేదని ప్రతి పక్షాలు గగ్గోలు పెడుతూ తప్పుదోవ పట్టిస్తున్నాయని, కేవలం బ్యాంకుల్లో చిన్న చిన్న సాంకేతిక సమస్యలు ఉన్న వారికి మాత్రమే రుణమాఫీ జరుగలేదని, వారి వివరాలు వ్యవసాయశాఖ ద్వారా సేకరించామని, త్వరలోనే వారందరికి రుణమాఫీ జరుగుతుందన్నారు. రైతులకు ఏ సమస్య వచ్చినా పరిష్కరిస్తానన్నారు. రామగుండంలో రైతాంగానికి సాగునీరుఅందించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామన్నారు. రామగుండం ప్రాంతానికి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు కొత్త పరిశ్రమలు స్థాపించి ఈ ప్రాంత యువతకు ఉపాధి కల్పించడం ద్వారా వలసలను నిరోధిస్తామన్నారు. సింగరేణి, టీఎస్ జెన్‌కో ఆధ్వర్యంలో 800మెగావాట్ల విద్యుత్ కేంద్రం, మేడిపల్లి ఓపెన్‌కాస్టులో 500మెగావాట్ల హైడల్ ప్రాజెక్టు రాబోతుందన్నారు. వీటితో పాటు మరిన్ని ఉపాధి కార్యక్రమాలు చేపడుతామన్నారు. ఈ ప్రాంతంలోని అవుట్ సోర్సింగ్ పనులు స్థానికులకే దక్కేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ సందర్భంగా రూ.20లక్షలతో హనుమాన్ టెంపుల్, విఠల్‌నగర్‌లో నిర్మించిన ఆర్‌ఓ ప్లాంట్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జీఎం లలిత్ కుమార్, మేయర్ బంగి అనిల్ కుమార్, ఆయా డివిజన్ల కార్పొరేటర్లు బొంతల రాజేష్, దొంత శ్రీనివాస్, ముస్తాఫా, బొడ్డు రజిత, నాయకులు కాల్వ లింగస్వామి, పాతపెల్లి ఎల్లయ్య, పెద్దెల్లి ప్రకాష్, బొంతల లచ్చన్న, గుంపుల ఓదెలుయాదవ్ పాల్గొన్నారు.



ఆర్‌వో ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

కార్మికుల జీవితాల్లో చీకటి నింపిన కాంగ్రెస్ ప్రభుత్వం

- నికర లాభాల నుంచి 33 శాతం వాటా చెల్లించాలి - మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కోరుకంటి చందర్

గోదావరిఖని, అక్టోబరు 4: సింగరేణి కార్మికుల జీవితాల్లో కాంగ్రెస్ సర్కార్ చీకటిని నింపిందని, నమ్మిన కార్మికులను నట్టేట ముంచేసిందని మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. సింగరేణి లాభాలు ప్రకటించేటప్పుడే 50శాతం కోత విధించి కార్మికులను మోసం చేసిందని, నికర లాభాల నుంచి 33శాతం వాటా చెల్లించాలనే డిమాండ్‌తో ఈనెల 6వ తేదిన గోదావరిఖని చౌరస్తాలో నిరసన దీక్ష చేపడుతున్నట్లు ఆయన ప్రకటించారు. శుక్రవారం స్థానిక బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో చందర్ మాట్లాడారు. బీఆర్ఎస్, టీబీజీకేఎస్ నాయకత్వంలో నిరసన దీక్ష చేస్తామన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో వచ్చిన నికర లాభాల నుంచి 33శాతం వాటా ఇచ్చే వరకు పోరాటాలు కొనసాగిస్తామన్నారు. లాభాల వాటాలో కాంగ్రెస్ చేసిన మోసంలో ఒక్కో కార్మికుడు రూ2 లక్షలు నష్టపోయాడని చందర్ అన్నారు.

ఈ విలేకరుల సమావేశంలో మిర్యాల రాజిరెడ్డి, కార్పొరేటర్లు పెంట రాజేష్, పాముకుంట్ల భాస్కర్, గాదం విజయ, నాయకులు నడిపెల్లి మురళీధర్‌రావు, పర్లపల్లి రవి, నూనె కొమురయ్య, అచ్చె వేణు, నారాయణదాసు మారుతి, బొడ్డుపెల్లి శ్రీనివాస్, కుడుదుల శ్రీనివాస్, మెతుకు దేవరాజు, సట్టు శ్రీనివాస్, గుంపుల లక్ష్మి, కోడి రామకృష్ణ, నిట్టూరి రాజు పాల్గొన్నారు.